ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు
జిల్లా వార్తలు
7
శుక్రవారం 11 అక్టోబరు 2024

అనంత లోకాలకు అమ్మ

- కడుపు నొప్పితో బాలింత ఆత్మహత్య
- తల్లికి దూరమైన ఐదు నెలల చిన్నారి

కడుపు నొప్పి ఉందని తల్లిదండ్రులకు చెప్పినా పట్టించుకోలేదు. అదేం కాదులే అని చెప్పి పొలానికి వెళ్లిపోయారు. ఎంతసేపటికీ కడుపు నొప్పి తగ్గకపోవడంతో భర్తకు ఫోన్ చేసింది. భర్త కూడా ఫోన్ లిఫ్ట్ చేయలేదు. ఓ వైపు తల్లిదండ్రులు తేలికగా తీసుకోవడం.. మరో వైపు భర్త నుంచి సమాధానం లేకపోవడం వెరసి ఆమె ఆత్మహత్యకు దారితీసింది. కళ్లు తెరిచి ఇప్పుడిప్పుడే ఈ లోకాన్ని చూస్తున్న ఆ చిన్నారికి అమ్మలేని లోటును మిగిల్చింది.



గీత (ఫైల్)



ఐదునెలల పాప

ఆదోని రూరల్, అక్టోబరు 10: ఆదోని మండలం కడితోట గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన నరసప్ప, మునెమ్మల దంపతులకు ఇద్దరు కొడుకులు, ఒక్కగానొక కూతురు గీత(22) ఉన్నారు. రెండేళ్ల క్రితం మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్న నరసింహతో గీతకు వివాహమైంది. ఐదు నెలల క్రితం గీత ప్రసవం కోసం పుట్టినింటికి వెళ్లింది. ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. ఈ క్రమంలోనే బుధవారం తనకు కడుపు నొప్పిగా ఉందని తల్లిదండ్రులకు తెలిపింది. బాలింత కావడంతో కడుపునొప్పి మామూలే అని కూతురుకు చెప్పి తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్లారు. అయితే కడుపునొప్పి ఎంతసేపటికీ తగ్గకపోవడంతో భర్తకు ఫోన్ చేసింది. భర్త కూడా గీత ఫోన్‌కు స్పందించలేదు. దీంతో మనస్తాపానికి గురైన బాలింత చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఇంటికొచ్చిన తల్లిదండ్రులు తమ కూతురు ఫ్యాన్‌కు వేలాడుతుండడం చూసి షాక్‌కు గురయ్యారు. కిందకు దించి హుటాహుటిన ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందిందని డాక్టర్లు చెప్పడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దతుంబళం ఎస్‌ఐ మహేష్ తెలిపారు. ఇప్పుడిప్పుడే కళ్లు తెరుస్తున్న చిన్నారి తల్లిలేని బిడ్డ అయింది.

మ్యాచ్ ఫిక్సింగ్

- 31 దుకాణాలకు 1,154 దరఖాస్తులు
- లోపాయికారి ఒప్పందాలు?
- రాజకీయ నిరుద్యోగులకు పెద్దపీట
- నేటితో ముగియనున్న గడువు



కర్నూలు(అర్బన్), అక్టోబరు 10: మద్యం టెండర్లలో మ్యాచ్ ఫిక్సింగ్ జరిగిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మద్యం పాలసీ విధానంలో క్వార్టర్ బాటిల్ రూ.98 నుంచి ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి. మరో వైపు మద్యం షాపులను పూర్తిగా ప్రైవేట్ పరం చేస్తున్నారు. వైసీపీ హయాంలో ప్రభుత్వమే మద్యం దుకాణాలను నడిపింది. ఆ పాలసీని రద్దు చేసి కూటమి ప్రభుత్వం మళ్లీ పాత పద్ధతిని తీసుకువచ్చింది. కానీ దరఖాస్తుల రుసుంను రూ.2 లక్షలుగా నిర్ణయించి భారీగా పెంచింది. గతంలో ఒక్కో షాపునకు 50 నుంచి వంద దరఖాస్తులు వచ్చేవని, ప్రస్తుతం ఒక్కో దుకాణానికి వందల సంఖ్యలో దరఖాస్తు చేసుకుంటున్న వైనం కనిపిస్తోంది. ఎంత మంది దరఖాస్తు చేసుకున్నా చివరికి తమ వారికే దుకాణాలు కట్టబెట్టేందుకు కొత్త ప్రయోగానికి కూటమి నాయకులు శ్రీకారం చుట్టారనే ప్రచారం ఉంది. 2024 ఎన్నికల్లో తమ కోసం పని చేసిన వారికి తాము ఏదో ఒకటి చేయాలి కదా.. అనే ధోరణిలో ఆయన నియోజకవర్గాల్లో ప్రజా ప్రతినిధులు తమ అనుచరులతో చెబుతుండడం గమనార్హం.

కర్నూలుకు పోటాపోటీ..

కర్నూలు నగరంలో 31 మద్యం దుకాణాలు ఉండగా 1,154 మంది దరఖాస్తులు చేసుకున్నారు. చివరి రోజు శుక్రవారం కాడంతో మరో 500 మంది దాకా దరఖాస్తులు చేసుకునే అవకాశం ఉందని ఎక్సైజ్ శాఖ అధికారులు అంచనా వేసుకుంటున్నారు. రోజు రోజుకూ నగరం, జిల్లాతో పాటు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు మద్యం దుకాణాలను దక్కించుకునేందుకు పోటీ పడుతున్నారు.

వారికి తగ్గేలా ప్రయత్నాలు

మద్యం టెండర్ల అంశంలో రాజకీయ నిరుద్యోగులకు నేతలు పెద్దపీట వేస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. మద్యం షాపుల దరఖాస్తుల అంశంలో ఆయా నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థుల విజయం కోసం కృషి చేసిన వారికి ప్రాధాన్యత ఇస్తూ వారు కోరుకున్న చోట మద్యం షాపులు అందడానికి ఎక్కడికక్కడ తగిన ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. దీని కోసం ముందుగానే అధికారుల నుంచి టెండర్ల సమాచారం తెలుసుకుని తమ అనుచర వర్గాలకే షాపులు దక్కేలా అన్ని రకాల ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు విమర్శలు ఉన్నాయి. జిల్లాలోని కొన్ని మండలాల్లో కొందరు తమకు షాపులు ఖరారయ్యాయని ప్రచారం చేసుకుంటూ, అందుకు సంబంధించిన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. దీన్ని బట్టి మద్యం టెండర్లలో మ్యాచ్ ఫిక్సింగ్ జరిగిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నెల 11 నాటికి దరఖాస్తుల గడువు ముగుస్తుంది. 12, 13 తేదీల్లో పరిశీలన, 14న లాటరీ పద్ధతిన మద్యం షాపులు ప్రారంభమయ్యే విధంగా ప్రభుత్వం నోటిఫికేషన్‌లో వివరాలు వెల్లడించింది. ఈ మేరకు మద్యం వ్యాపారులు చేయాలనుకునే పలువురు రాజకీయ నిరుద్యోగులు ఆయా నియోజకవర్గాల్లో తమకు కచ్చితంగా షాపులు దక్కేలా ఏర్పాట్లు చేసుకున్నారనే అభిప్రాయాలు ఉన్నాయి.

దరఖాస్తులు ఇలా..

జిల్లాలోని 99 మద్యం దుకాణాలకు 2461 మంది దరఖాస్తులు చేసుకున్నారు. శుక్రవారం రాత్రి 8గంటల వరకు కర్నూలు-1154, కోడుమూరు-400, ఆదోని -215, ఆలూరు 167. ఎమ్మిగనూరు-228, కోసిగి 40, పత్తికొండ 243 మంది దరఖాస్తులు అందాయి.

రతన్ టాటా మృతి బాధాకరం

మంత్రి టీజీ భరత్



కర్నూలు(అర్బన్), అక్టోబరు 10: దిగ్గజ పారిశ్రామికవేత్త, టాటాగ్రూప్స్ చైర్మన్ రతన్ టాటా మృతి బాధాకరమని రాష్ట్ర పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ రతన్ టాటా మరణ వార్త తనను దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. ఆయన ఆలోచనా విధానంతో టాటా గ్రూప్స్‌ను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లారని, ఎన్నో పరిశ్రమలు నెలకొల్పి లక్షలాది మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించారని తెలిపారు. దేశంలో పారిశ్రామిక రంగం ఎదుగుదలకు ఆయన ఎంతో కృషి చేశారన్నారు. రతన్ టాటా జీవితంలో ఎంతో మందికి ఆదర్శమన్నారు.

సీనియారిటీ జాబితాపై కసరత్తు

కర్నూలు(కలెక్టరేట్), అక్టోబరు 10: జిల్లాలోని రెవెన్యూ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ చేసేందుకు రెవెన్యూ శాఖ కసరత్తు ప్రారంభించింది. అందులో భాగంగా గ్రేడ్-2 వీఆర్వోలకు, గ్రేడ్-1 వీఆర్వోలుగా, గ్రేడ్-1 వీఆర్వోలకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించనున్నారు. ఈ మేరకు గ్రేడ్-2 వీఆర్వోలకు కనీసం రెండు సంవత్సరాలు వీఆర్వోలుగా పని చేయాలి. గ్రేడ్-1 వీఆర్వోలకు సీనియర్ అసిస్టెంట్లు పదోన్నతులకు డిగ్రీ అర్హత కలిగి ఉండి, వీఆర్వోలుగా కనీసం ఐదు సంవత్సరాలు పని చేసి ఉండాలి. ఉమ్మడి జిల్లాలో 45 మంది గ్రేడ్-2 వీఆర్వోలుకు ప్రొఫెషన్ డిక్లరేషన్ పూర్తి కాలేదు. ఉమ్మడి జిల్లాలో గ్రేడ్-2 వీఆర్వోలుగా 464 మంది, గ్రేడ్-1లు 585 మంది వీఆర్వోలు పని చేస్తున్నారు.

రైతు బజార్లను విస్తరిస్తున్నాం

- ఏడీఎం నారాయణమూర్తి

కర్నూలు(అగ్రికల్చర్), అక్టోబరు 10: ప్రజలకు తక్కువ ధరకే నాణ్యమైన తాజా కూరగాయలను అందించేందుకు మార్కెటింగ్ శాఖ రైతుబజార్ల ద్వారా చర్యలు తీసుకుంటోందని మార్కెటింగ్ శాఖ ఏడీఎం నారాయణమూర్తి అన్నారు. గురువారం కర్నూలు నగరంలోని సీ క్యాంపు రైతుబజారు, వెంకటరమణ కాలనీలోని అమీన్ అబ్బాస్ నగర్ కొత్తపేట రైతుబజార్లలో కూరగాయల క్రయవిక్రయాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏడీఎం నారాయణమూర్తి మాట్లాడుతూ కూరగాయలను రైతుబజార్లల్లో తక్కువ ధరకే ప్రజలకు అందించేందుకు చర్యలు చేపట్టామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సీ క్యాంపు రైతుబజారును విస్తరించేందుకు రూ.2.27 కోట్లతో ప్రతిపాదనలు పంపామని చెప్పారు. అదేవిధంగా కల్లూరులో రైతుబజారు ప్రారంభానికి అన్ని పనులు పూర్తయ్యాయని, త్వరలోనే ప్రజాప్రతినిధుల చేత ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. ఎమ్మిగనూరులో కూడా రైతుబజారును ఏర్పాటు చేసేందుకు పరిశీలన చేస్తున్నామని వెల్లడించారు. ఈ తనిఖీల్లో ఎస్టేట్ అధికారులు హరీష్ కుమార్, హార్టికల్చర్ అసిస్టెంట్ శివకుమార్, కళ్యాణమ్మ, జయలక్ష్మి, సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, శివన్న పాల్గొన్నారు.

చెత్తకుండీల ధ్వంసంపై ఆగ్రహం

● సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బందిపై మండిపడిన జీజీహెచ్ సూపరింటెండెంట్


ధ్వంసమైన సిమెంటు కుండీలను పరిశీలిస్తున్న సూపరింటెండెంట్

కర్నూలు(హాస్పిటల్), అక్టోబరు 10: సర్జికల్ వార్డుల దగ్గర పెట్టిన సిమెంటు చెత్త కుండీని పగులకొట్టడంపై కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం సీఎస్ఆర్ఎంవో డా. బీవీ రావు, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డా. కిరణ్ కుమార్, డయాగ్నోస్టిక్ బ్లాక్ మెడికల్ ఆఫీసర్ డా. సునీల్ ప్రశాంత్‌తో కలిసి ఆయన రౌండ్స్ నిర్వహించారు. కొత్తగా పెట్టిన సిమెంటు చెత్త కుండీలను ఎవరూ పగులకొట్టారని, సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బంది ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కుండీలను పగులకొట్టకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సూపరింటెండెంట్ వెంట ఆసుపత్రి నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2 విమలమ్మ, ఏవో శ్రీనివాసులు పాల్గొన్నారు.

తైక్వాండో క్రీడాకారులను అభినందించిన ఎమ్మెల్యే

కర్నూలు(స్పోర్ట్స్), అక్టోబరు 10: రాష్ట్ర స్థాయిలో మెడల్స్ సర్టిఫికెట్లు సాధించిన తైక్వాండో క్రీడాకారులను పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి గురువారం అభినందించారు. ఈ నెల 6, 7, 8 తేదీల్లో తిరుపతి శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ స్కూల్ గేమ్స్ అండర్-17 బాలుర, బాలికల తైక్వాండో కోచ్ జి. షబ్బీర్ హుశేన్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన క్రీడాకారులు ముగ్గురు బ్రౌంజ్ మెడల్స్ సాధించారు. వారికి మెడల్స్, సర్టిఫికెట్స్ ప్రదానం చేసి అభినందించారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

సి.బెళగల్, అక్టోబరు 10: నిత్యావసర సరుకులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలో కూరగాయాల మార్కెట్ దగ్గర ధరలను సూచించే బోర్డు అలాగే మండలంలోని 10 రెవెన్యూ గ్రామాల్లో కిరాణం దుకాణాల దగ్గర ధరల పట్టికను ఏర్పాటు చేశామన్నారు. ఈసందర్భంగా తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో సూచించే ధరల కంటే అధిక ధరలకు కిరాణం దుకాణం యజమానులు విక్రయిస్తే రెవెన్యూ అధికారులకు సమాచారం అందజేయాలని మండల ప్రజలకు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పురుషోత్తం, వీఆర్వోలు, వెంకటేశ్వర్లు, గౌరి ఉన్నారు.

దేవాలయాలకు స్వయం ప్రతిపత్తిపై హర్షం

కర్నూలు(న్యూసిటీ), అక్టోబరు 10: రాష్ట్రంలోని దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటరామరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గత వైసీపీ పాలనలో ఆ పార్టీ నాయకులు ఆలయాల ఆచార వ్యవహారాలు, సాంప్రదాయాల్లో జోక్యం చేసుకుని భ్రష్టు పట్టించారన్నారు.

కర్నూలు(కల్చరల్): రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో వైదిక విధుల నిర్వహణలో ఆలయ ఈవో సహా ఇతరుల జోక్యం లేకుండా అర్చకులకు స్వయం ప్రతిపత్తి కల్పిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకున్న నిర్ణయం హర్షణీయమని బ్రాహ్మణ సేవా సంక్షేమ మిత్రమండలి వ్యవస్థాపక అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఆలయాల్లో అర్చకులపై దాడులు, దౌర్జన్యాలు జరిగి, అర్చక వృత్తి అంటేనే భయపడేలా పరిస్థితి ఉండేదని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక దేవాలయాలను ప్రక్షాళన చేయడంతోపాటు విధుల నిర్వహణలో అర్చకులదే తుది నిర్ణయమని ప్రభుత్వం స్పష్టం చేయడాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు.

మంత్రి బీసీని కలిసిన టీడీపీ నాయకులు

ఓర్వకల్లు, అక్టోబరు 10: రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని టీడీపీ నాయకులు చంద్రపెద్దస్వామి, చదువుల సుధాకర్ రెడ్డి గురువారం విజయవాడలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి బొకే అందజేశారు. అలాగే హుశేనాపురం, పాలకొలను గ్రామాల్లో ఉన్న సమస్యలను మంత్రికి నాయకులు వివరించారు.


మంత్రి బీసీకి బొకే ఇస్తున్న టీడీపీ నాయకులు

అవినీతిపై కొనసాగుతున్న విచారణ

ఓర్వకల్లు, అక్టోబరు 10: కాల్వబుగ్గ రామేశ్వరస్వామి దేవస్థానం నిధుల అవినీతిపై మూడో రోజు గురువారం కూడా విచారణ జరిగింది. దేవదాయ శాఖ అసిస్టెంట్ జేఈవో పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో 1990 నుంచి 2024 అక్టోబరు 10వ తేదీ వరకు దాతలు అందించిన బంగారు, రాగి వంటివాటిపై విచారణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ రమేష్, ఈవో మద్దిలేటి, అర్చకులు కల్లె లక్ష్మీనారాయణశర్మ, కల్లె లక్ష్మీనరసింహ శర్మ పాల్గొన్నారు.

● **పదవీ బాధ్యతలు చేపట్టిన ఈవో మద్దిలేటి:** కాల్వబుగ్గ రామేశ్వర స్వామి ఆలయ ఈవోగా మద్దిలేటి గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఈవో డీఆర్‌కేవీ ప్రసాద్ బదిలీల్లో భాగంగా యాగంటీశ్వరస్వామికి బదిలీ కావడంతో ఓర్వకల్లు ఈవోగా పని చేస్తున్న మద్దిలేటిని కాల్వబుగ్గ ఈవోగా బదిలీ చేయగా గురువారం ఆయన పదవి బాధ్యతలు స్వీకరించారు.

దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు


కర్నూలులో వివిధ రూపాల్లో దర్శనమిస్తున్న అమ్మవారు

కర్నూలు(కల్చరల్), అక్టోబరు 10: కర్నూలు నగరంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. వన్‌టౌన్ కాళికాంబ ఆలయం, నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలోని భరత మాత ఆలయం, బుధవారపేటలోని గురునానక్ నగర్‌లోని కనకదుర్గ ఆలయాల్లో అమ్మవారు ఎనిమిదో రోజు గురువారం దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. నగర శివారు మామిదాల పాడులోని గోదా గోకుల క్షేత్రంలో అమ్మవారు ధనలక్ష్మిగా, వన్‌టౌన్‌లోని నిమిషాంబ ఆలయంలో కనకదుర్గా దేవి అలంకరణ చేశారు. పాతనగరంలోని గీతామందిరంలో అమ్మవారికి అశ్వత్థ వృక్షంలోని శివుని రూప అలంకరణ చేశారు. వృక్షం మూలంలో బ్రహ్మ, మధ్యలో విష్ణువు, అగ్రతో శివరూపాన్ని భక్తులకు దర్శనం కల్పించారు. అశోక్‌నగర్‌లోని ప్రసన్నాంజనేయస్వామి, ద్వార కామాయి సాయి బాబా దేవస్థానంలో గురువారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కల్లూరు: గుత్తిపెట్రోల్ బంక్ సమీపంలోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో గురువారం మహాదుర్గా దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు లక్ష్మీనరసింహాశర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి ట్రస్టీ శివరామకృష్ణ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

గూడూరు: గూడూరులోని వీరభద్రస్వామి ఆలయంలో ఎనిమిదో రోజు గురువారం అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శమిచ్చారు.

● మండలం కె.నాగలాపురం గ్రామంలోని అమ్మవారి ఆలయంలో సుంకులాపరమేశ్వరి దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.


సూర్యనారాయణ స్వామి ఆలయంలో..


గూడూరు, కె నాగలాపురంలో దుర్గాదేవిగా..

సుంకులా పరమేశ్వరిని దర్శించుకున్న ఎమ్మెల్యే


పూజలు చేస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి

గూడూరు అక్టోబరు 10: గూడూరు మండలంలోని కె నాగలాపురం సుంకులాపరమేశ్వరి అమ్మవారిని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి దర్శించుకున్నారు. గురువారం ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి కె నాగలాపురంలోని అమ్మవారి ఆలయానికి చేరుకోగానే ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువా కప్పి పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోపాల్ రెడ్డి, సురేష్, నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ కె రామాంజనేయులు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్ర గోపాల్ నాయుడు, కె కృష్ణ, ఎంపీటీసీ మద్దిలేటి, కర్ణం చిన్న గిడ్డయ్య, హలీప్ బాషా, ఆలయ సిబ్బంది కేశవ పాల్గొన్నారు.

పల్లె పండుగను విజయవంతం చేయండి

ఓర్వకల్లు, అక్టోబరు 10: పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలను విజయవంతం చేయాలని ఎంపీడీవో శ్రీనివాసులు కోరారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు ప్రభుత్వం పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. 14న ఓర్వకల్లు, 15న కొమరోలు, వెంకటాపురం, సోమయాజులపల్లె, చెన్నంచెట్టిపల్లె, 16న పాలకొలను, చింతలపల్లె, కన్నమడకల, తిప్పాయపల్లె, 17న కాల్వ, భైరాపురం, ఉప్పలపాడు, గుడుంబాయితాండా, 18న లొద్దిపల్లె, మీదివేముల, ఎస్.కొంతలపాడు, ఉయ్యాలవాడ, 19న నన్నూరు, హూడిచెర్ల, కేతవరం గ్రామాల్లో గ్రామ సభలు, ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన పనులకు భూమి పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

వైద్య విద్యార్థికి చేయూత

కర్నూలు(కల్చరల్), అక్టోబరు 10: ఏపీ ఎస్సీ, ఎస్టీ గజిటెడ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంబీబీఎస్ చదువుతున్న పేద విద్యార్థి ప్రవీణ్‌బాబుకు చేయూత ఇస్తామని అసోసియేషన్ ప్రతినిధులు ప్రకటించారు. గురువారం అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆ విద్యార్థికి రూ. 34,500 చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ స్టేట్ అసోసియేట్ అధ్యక్షుడు హరిదాస్ ఈరన్న, జిల్లా అధ్యక్షుడు మధుసూదన్, జనరల్ సెక్రటరీ చంద్రశేఖర్ పాల్గొన్నారు. అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న పగిడ్యాల మండలం ప్రాతకోట గ్రామానికి చెందిన ప్రవీణ్‌బాబుకు ఈ సాయం అందించారు.

పంట పొలాలకు దారి చూపాలి


జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న రైతులు

కర్నూలు(రూరల్), అక్టోబరు 10: కర్నూలు-అమరావతి 340సీ జాతీయ రహదారిలో రైతులు తమ పంట పొలాలకు వెళ్లేందుకు దారి చూపాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి. రామకృష్ణ, రూరల్ మండలం గౌరవ అధ్యక్షుడు బాలాపీరా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కర్నూలు రూరల్ మండలంలో నిర్మాణ పనులు జరుగుతున్న 340సీ జాతీయ రహదారిపై గురువారం నూతనపల్లె రైతులతో కలిసి వారు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ఎంతో విలువైన భూములను కారుచౌకగా ఎకరాకు కేవలం రూ.11లక్షలు మాత్రమే రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అంతేకాక మిగిలిన వారి పొలాలకు వెళ్లేందుకు కూడా దారి లేకపోవడం దారుణమన్నారు.

దుర్గామాత నిమజ్జన ఏర్పాట్లు పరిశీలన


దుర్గా ఘాట్ వద్ద నిర్వాహకులకు సూచనలిస్తున్న టీజీ వెంకటేశ్

కర్నూలు(కల్చరల్), అక్టోబరు 10: నగరంలో ఏర్పాటు చేసిన దుర్గామాత ఉత్సవ విగ్రహాల నిమజ్జనం ఈనెల 13న ఉన్నందున గురువారం సంకల్‌బాగ్‌లోని తుంగభద్ర నదీ తీరానగల దుర్గాఘాట్‌ను రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ పరిశీలించారు. ప్రతి ఏటా టీజీవీ గ్రూప్స్ ఆఫ్ కంపెనీస్ సహకారంతో నగరంలోని వివిధ ప్రాంతాల్లో దుర్గామాత మట్టి విగ్రహాలు ప్రతిష్ఠించి పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో విగ్రహాల నిమజ్జన మహోత్సవం నగరంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో దుర్గాఘాట్‌లో ఉత్సవాల ఏర్పాట్లపై టీజీ వెంకటేశ్ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


రైతులకు పప్పుశనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, అక్టోబరు 10: రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని నంద్యాల టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. గురువారం మండలంలోని హుశేనాపురం రైతుభరోసా కేంద్రంలో శనగ విత్తనాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి 2,650 క్వింటాళ్ల పప్పు శనగ విత్తనాలు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో మధు, రైతులు సుధాకర్, రామగోవిందు, నారాయణ, గొల్ల నాగరాజు, శేఖరప్ప, గువ్వ రవికుమార్, మాజీ ఎంపీటీసీ నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో మార్షల్ ఆర్ట్స్‌ను సబ్జెక్టుగా చేర్చాలి


తైక్వాండో క్రీడాకారులతో డాక్టర్ శంకర్‌శర్మ

కర్నూలు(స్పోర్ట్స్), అక్టోబరు 10: దేశంలోని అన్ని విద్యాసంస్థల్లో కరాటే లాంటి మార్షల్ ఆర్ట్స్‌ను ఖచ్చితంగా ఒక సబ్జెక్టుగా చేర్చి శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డా.బి. శంకర్‌శర్మ అన్నారు. గురువారం స్థానిక కొండారెడ్డి బురుజు సమీపంలో ఉన్న మున్సిపల్ పార్కులో సీనియర్ తైక్వాండో శిక్షకుడు టి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్రీడాకారులకు ట్రాక్ షూస్, పంచ్ గార్డ్స్‌ను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శంకర్‌శర్మ మాట్లాడుతూ దేశంలో అమ్మాయిలకు ఆత్మరక్షణ కోసం కరాటే మార్షల్ ఆర్ట్ శిక్షణ ఎంతైనా అవసరమన్నారు.

రతన్ టాటా మృతి దేశానికే తీరని లోటు

కర్నూలు(న్యూసిటీ), అక్టోబరు 10: ప్రపంచ పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా మృతి దేశానికే తీరని లోటు అని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య అన్నారు. రతన్ టాటా భారతదేశానికి ప్రజలకు ఎనలేని సేవలు అందిం చారని, టాటా గ్రూప్ సంస్థల్లో లక్షలాది మంది ప్రజలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారన్నారు.

కర్నూలు(రూరల్): భారతదేశానికి రతన్‌టాటా చేసిన సేవలు మరువలేనివని మానవతా సేవా సంస్థ కర్నూలు యూనిట్ కన్వీనర్ మనోహర్ రెడ్డి అన్నారు. గురువారం మానవతా సేవా సంస్థ కార్యాలయంలో రతన్‌టాటా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో హనుమంతరెడ్డి, శివారెడ్డి, చంద్రారెడ్డి, మురళీధర్‌రెడ్డి, లక్ష్మీరెడ్డి, ప్రభాకర్, యుగంధర్, హరి, సురేష్ బాషా పాల్గొన్నారు.

నేడు, రేపు మార్కెట్ యార్డుకు సెలవు

కర్నూలు(అగ్రికల్చర్), అక్టోబరు 10: దసరా పండుగను పురస్కరించుకుని కర్నూలు మార్కెట్ యార్డుకు ఈనెల 11, 12 తేదీల్లో సెలవు ప్రకటించామని సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి గురువారం తెలిపారు. రైతులు ఈ విషయాన్ని గ్రహించి పంట ఉత్పత్తులను విక్రయానికి తీసుకురావద్దని విజ్ఞప్తి చేశారు.

బీజేపీ క్రీడలో పవన్ కళ్యాణ్ బలి కావద్దు

కర్నూలు(అర్బన్), అక్టోబరు 10: బీజేపీ క్రీడలో జగన్‌లా.. పవన్ కళ్యాణ్ బలికావద్దని కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి కొత్తూరు సత్యనారాయణ గుప్త అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని మీడియా పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ బీజేపీ వైఎస్ జగన్మోహన్ రెడ్డిని వాడుకుని వదిలేసిందని అన్నారు. గతంలో చంద్రబాబును తర్వాత జగన్మోహన్‌రెడ్డిని ఇప్పుడు పవన్ కళ్యాణ్‌ను ఆ పార్టీ వాడుకుని వదిలేస్తుందని అన్నారు.

చైన్ స్నాచింగ్ నియంత్రణకు చెక్‌పోస్టులు

కర్నూలు, అక్టోబరు 10: నగరంలో ఇటీవల గొలుసు దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో టూటౌన్ సీఐ నాగరాజరావు ఆధ్వర్యంలో పోలీసులు నియంత్రణ చర్యలు చేపట్టారు. టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెంకటరమణ కాలనీ వద్ద ఒక చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. పోలీసులు ఆ ప్రాంతంలో తనిఖీలకు వెళ్లిన సందర్భంలో అక్కడ ఉండే విధంగా ప్రత్యేక పోలీసు పోస్టు ఏర్పాటు చేశారు.

ఉద్యోగులకు అండగా కాంగ్రెస్

కర్నూలు(అర్బన్), అక్టోబరు 10: నాల్గవ తరగతి ఉద్యోగులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు బజారన్న అన్నారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాల్గవ తరగతి ఉద్యోగులతో రౌండ్ టేబుల సమావేశం జరిగింది. ప్రజాసంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు హాజరయ్యారు. ఏఐఆర్‌కే డేవిడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నగర ముస్లిం మైనార్టీ సెల్ చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, బజారన్న మాట్లాడుతూ ఉద్యోగుల కోసం కేటాయించిన స్థలంలో అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేసి అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నవరాత్రి వేడుకల్లో గౌరు చరిత పూజలు


గౌరు దంపతులను ఆశీర్వదిస్తున్న వేదపండితులు

కల్లూరు, అక్టోబరు 10: దసరా శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత ఆమె తనయుడు గౌరు జనార్దన్‌రెడ్డి కల్లూరు కాలనీల్లో పర్యటించి అమ్మవారిని దర్శించుకున్నారు. గురువారం టీడీపీ జిల్లా కోశాధికారి పీయూ మాదన్న, 36వ వార్డు ఇన్‌చార్జ్ తిరుమలేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో గణేష్ నగర్, వాసవీనగర్‌లో అమ్మవారికి ఎమ్మెల్యే గౌరుచరిత పూజలు చేశారు.

● కర్నూలు అర్బన్ 32 వార్డులో వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారికి గౌరు దంపతులు పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే గౌరు చరిత, నందికొట్కూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డిలకు వేదపండితులు ఆశీర్వదించారు.

ఐదుగురికి బీటింగ్ హార్ట్ సర్జరీలు

కర్నూలు(హాస్పిటల్), అక్టోబరు 10: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో వారం రోజుల్లో ఎన్టీఆర్ వైద్యసేవ కింద ఐదుగురు రోగులకు సిటీ సర్జన్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి బీటింగ్ హార్ట్ ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహించారు. కర్నూలు అశోక్‌నగర్‌కు చెందిన 52 ఏళ్ల సరస్వతి నంద్యాల జిల్లా రుద్రవరం చెందిన రామలింగేశ్వర్ (58), మంత్రాలయం శ్రీనివాసులు (50), పలుకూరు చెందిన కనకన్న (63), దేవనకొండకు చెందిన గౌస్ (36) వీరంతా గుండె సమస్యలతో గుండె ఊపిరితిత్తుల వార్డులో చేరారు. వారం వ్యవధిలో ఐదు మంది రోగులకు రికార్డు స్థాయిలో బైపాస్ సర్జరీ బీటింగ్ హార్ట్ పద్ధతిలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సి.ప్రభాకర్ రెడ్డి, సిటీవీఎస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.రవీంద్ర, మెడికల్ ఆఫీసర్ డా.హిమబిందు, అనస్థీషియా డాక్టర్ కొండారెడ్డి, ఆపరేషన్‌ను నిర్వహించారు.

పబ్లిక్ నోటీస్

తేది: 11-10-2024

కర్నూల్ జిల్లాకి చెందిన అనేక సర్వే నంబర్లలో ఉన్న డ్రై అగ్రికల్చర్ భూములను మా క్లయింట్ జెంటారీ రెన్యూవబుల్స్ ఇండియా క్లస్టర్ వన్ ప్రైవేట్ లిమిటెడ్, గురుగ్రామ్, హర్యానా వారు భూమి యజమానుల వద్ద నుండి కొనుగోలు చేయాలని భావిస్తున్నట్లు సాధారణ ప్రజలకు సమాచారం అందించారు. ఆ సమాచారం మేరకు కొందరు భూమి యజమానులు మా క్లాయింట్ వారికి భూములు అమ్ముటకు సమ్మతించారు. భూమి మరియు దాని యజమానుల వివరాలు షెడ్యూల్ పోర్షన్‌లో క్రింద పేర్కొనబడ్డాయి. ఈ క్రింద పేర్కొన్న యజమానులు వారు వారి షెడ్యూల్ ఆస్తులపై సంపూర్ణ యజమాన హక్కులు కలిగి సదరు భూములపై స్వాధీన అనుభవంతో ఉన్నారు.

ఏదైనా వ్యక్తి / ఆ సంస్థ / బ్యాంక్ లేదా ఆర్థిక సంస్థ ఏదైనా హక్కు, టైటిల్, క్లెయిమ్, ప్రయోజనం, ఎస్టేట్, వాటా, డిమాండ్ లేదా మరియేతర హక్కు కలిగి ఉంటే లేదా సేల్, బదిలీ ద్వారా షెడ్యూల్ ప్రాపర్టీలు లేదా దానిలోని ఏదైనా భాగానికి సంబంధించి ఏదైనా స్వభావం కలిగి ఉంటే లేదా క్లెయిమ్ చేస్తే, మార్టిగేజ్, అసైన్‌మెంట్, ఛార్జ్, దానము, ఒడంబడిక, ట్రస్ట్, లైసెన్స్, అద్దె, వాటా, ఉప-అద్దె, వారసత్వం, రావా, అనుమతి, లీజు, ఉప-లీజు, తాత్కాలిక హక్కు తనఖా, సదలింపు, రూపకల్పన, డిక్రీ, హైపోతికేషన్, భారాలు, స్వాధీనం అభివృద్ధి హక్కులు, పార్ట్ పెర్ఫార్మెన్స్‌లో స్వాధీనం, భాగస్వామ్యం, కుటుంబ ఏర్పాటు / సెటిల్‌మెంట్, లిస్ పెండెన్సీలు, ఏదైనా న్యాయస్థానం యొక్క డిక్రీ ఆర్డర్ లేదా ఎలాగైనా, చట్టం యొక్క ఆపరేషన్ ద్వారా లేదా మరేదైనా, మద్దతు పత్రాలతో పాటుగా తమ అభ్యంతరాలను దాఖలు చేయవలసి ఉంటుంది. ఈ నోటీసు ప్రచురించబడిన తేదీ నుండి 7 (ఏడు) రోజులలోపు అభ్యంతరాలను ఈ క్రింద కనపరచిన చిరునామా నందు దాఖలు చేయడంలో విఫలమైతే, షెడ్యూల్‌లో లేదా దాని మీద లేదా దానికి సంబంధించి ఎలాంటి ప్రతికూల హక్కు, టైటిల్ ఆసక్తి, వాటా, రావా లేదా డిమాండ్ ఉండదని భావించబడుతుంది. ఆస్తి వివరములు.

భూమి మరియు దాని యజమానుల షెడ్యూల్ మరియు వివరాలు వరుసగా

వ. నం	రైతు పేరు	ఖాతా నెం.	సర్వే నెం.	మొత్తం విస్తీర్ణం	గ్రామం	మండలం
1	ఎరుగుండాల విష్ణువర్ధన్ రెడ్డి S/o ఎరుగుండాల మీనాక్షి నాయుడు	1650	26-B	2.29	ఏరూరు	చిప్పగిరి
2	ఎరుగుండాల విష్ణువర్ధన్ రెడ్డి S/o ఎరుగుండాల మీనాక్షి నాయుడు	1650	26-A	1.43	ఏరూరు	చిప్పగిరి
3	సి.శ్రీనివాసులు చౌదరి S/o రామచంద్రప్ప	1694	26-B	0.58	ఏరూరు	చిప్పగిరి
4	సి.శ్రీనివాసులు చౌదరి S/o రామచంద్రప్ప	1694	26-A	0.32	ఏరూరు	చిప్పగిరి
5	సి.శ్రీనివాసులు చౌదరి S/o రామచంద్రప్ప	1694	26-C	2.37	ఏరూరు	చిప్పగిరి
6	లక్ష్మీ నారాయణరావు S/o శ్యామరావు	211	26-C	2.18	ఏరూరు	చిప్పగిరి
7	బి. చంద్రశేఖర్ S/o రామాంజినేయులు	748	27	8.28	ఏరూరు	చిప్పగిరి
8	బావిగడ్డ నారాయణస్వామి S/o రామాంజినయ్య	911	27	8.28	ఏరూరు	చిప్పగిరి
9	గోవిందరెడ్డి S/o నారాయణ రెడ్డి	58	64-C	5.95	సిరుగపురం	హొలహర్వి
10	గూళ్యపాలెం కృష్ణ చైతన్యరెడ్డి S/o నారాయణ రెడ్డి	656	64-C	2.87	సిరుగపురం	హొలహర్వి
11	గోవింద్ రెడ్డి S/o నారాయణ రెడ్డి	58	60-B	2.27	సిరుగపురం	హొలహర్వి
12	గూళ్యపాలెం కృష్ణ చైతన్యరెడ్డి S/o నారాయణ రెడ్డి	656	60-B	1.13	సిరుగపురం	హొలహర్వి
13	K మల్లప్ప S/o K ఈరన్న	403	321	2.945	కురువల్లి	ఆలూరు
14	సేరి రాముడు S/o సేరి ఈరన్న	400	321	3.113	కురువల్లి	ఆలూరు
15	కె. రమేష్ S/o పాండురంగప్ప	732	321	5.763	కురువల్లి	ఆలూరు
16	జి.మల్లయ్యస్వామి S/o జి.పాండురంగప్ప	318	320	3.012	కురువల్లి	ఆలూరు
17	కురువ ఐందు S/o గంగప్పగారి కురువ సురేష్	761	320	3.175	కురువల్లి	ఆలూరు
18	G రాఘవేంద్ర S/o G పాండు రంగప్ప	435	332	3.470	కురువల్లి	ఆలూరు
19	R.భీమేష్ S/o భీమలింగప్ప	932	457	7.88	బెలడొన	చిప్పగిరి
20	B.చంద్రశేఖర్ S/o రామాంజినేయులు	748	27	8.28	ఏరూరు	చిప్పగిరి
21	బావిగడ్డ నారాయణస్వామి S/o రామాంజినయ్య	911	27	8.28	ఏరూరు	చిప్పగిరి
22	ఎరగండుల మీనాక్షి నాయుడు S/o దామన్న	798	180-A	6.00	ఏరూరు	చిప్పగిరి
23	ఎరగండుల హరీష్ S/o రాజన్న	799	180-A	6.00	ఏరూరు	చిప్పగిరి
24	J. రమణయ్య S/o హనుమంతప్ప	476	180.BC1	3.46	ఏరూరు	చిప్పగిరి
25	J. రమణయ్య S/o హనుమంతప్ప	476	180.BC2	3.58	ఏరూరు	చిప్పగిరి
26	అనుముడి రామ క్రిష్టప్ప S/o అనుముడి నేమకల్లప్ప	480	691-B	14.42	హలాహర్వి	హొలహర్వి
27	అనుముడి హేమవతి W/o అనుముడి రామ క్రిష్టప్ప	942	691-B	7.00	హలాహర్వి	హొలహర్వి
28	అనుముడి అనిల్ కుమార్ S/o అనుముడి రామ కృష్ణప్ప	943	691-B	1.08	హలాహర్వి	హొలహర్వి
29	అనుముడి అనిల్ కుమార్ S/o అనుముడి రామ కృష్ణప్ప	943	691-C	6.35	హలాహర్వి	హొలహర్వి
30	J. శ్రీనాథ్ S/o J. మాణిక్య శాస్త్రి	12	691-D	4.54	హలాహర్వి	హొలహర్వి
31	బి.గోపాల్ S/o బి రామాంజిని	775	34-C	3.49	సిరుగపురం	హొలహర్వి
32	బి.గోపాల్ S/o బి రామాంజిని	775	34-D	0.80	సిరుగపురం	హొలహర్వి
33	T.నరేష్ S/o T.గోవిందప్ప	739	34-E/1	2.41	సిరుగపురం	హొలహర్వి
34	బి.మౌలాలి S/o ఉలిగన్న	458	34-C	4.00	సిరుగపురం	హొలహర్వి
35	H.T. శ్రీనివాస రెడ్డి S/o హొలహర్వి తిప్పారెడ్డి గారి రంగనాథ్ రెడ్డి	2263	177	14.13	హలాహర్వి	హొలహర్వి
36	చెరుకూరు సత్యన్న S/o లక్ష్మన్న	578	122-A1	4.08	ఏరూరు	చిప్పగిరి
37	చెరుకూరు వినయ్ S/o నారాయణ స్వామి	1492	123	5.00	ఏరూరు	చిప్పగిరి
38	సి మధన్ మోహన్ S/o నారాయణ స్వామి	1412	123	1.27	ఏరూరు	చిప్పగిరి
39	మధన్ మోహన్ S/o నారాయణ స్వామి	1412	122-A2	3.75	ఏరూరు	చిప్పగిరి
40	శ్రీరాములు S/o నెట్టేకల్లు	649	39-C3	2.72	రామదుర్గం	చిప్పగిరి
41	శాంతమ్మ W/o మల్లయ్య	550	39-C3	2.73	రామదుర్గం	చిప్పగిరి
42	జయమ్మ W/o రోగయ్య	1282	39-C3	2.80	రామదుర్గం	చిప్పగిరి
43	రామాంజినేయులు S/o చిన్న నెట్టేకల్లు	552	39-C4	4.00	రామదుర్గం	చిప్పగిరి

షేక్ ఖుద్దూస్, MBA., LLB., అడ్వకేట్,
డి.నెం. 1-52, తిమ్మాపూర్ (గ్రామం), మిడుతూర్ (మం.),
నంద్యాల జిల్లా. సెల్ : 90520 65030

మహాగౌరిగా భ్రమరాంబ







నృత్యం చేస్తున్న కళాకారులు



- నంది వాహనంపై దర్శనమిచ్చిన ఆది దంపతులు
- ఆకట్టుకున్న సంప్రదాయ నృత్యాలు





కళాకారుల ప్రదర్శన

శ్రీశైలం, అక్టోబరు 10: శ్రీశైలం మహాక్షేత్రంలో దసరా మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. నవరాత్రోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు గురువారం అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు. అమ్మవారు నవదుర్గ అలంకరణలలో ఒకటైన మహాగౌరిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. సాయంత్రం వాహనసేవలో భాగంగా నందివాహనంపై మల్లికార్జునస్వామి, భ్రమరాంబికాదేవిలు దర్శనమిచ్చారు. అయితే వర్షం రావడంతో గ్రామోత్సవాన్ని రద్దు చేశారు. కళాకారుల ప్రదర్శనలు, సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఉత్సవాలను ఆలయ ఈఓ డి.పెద్దిరాజు పర్యవేక్షించారు.

నేడు ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు

శుక్రవారం భ్రమరాంబికా అమ్మవారు సిద్ధిదాయిని అలంకారంలో దర్శనమిస్తారు. స్వామి, అమ్మవార్లకు అశ్వవాహనసేవ నిర్వహించనున్నారు. అదేవిధంగా దసరా మహోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించనున్నారు.

అమ్మవారి తపస్సుకు ప్రసన్నుడైన పరమశివుడు

నవదుర్గల్లో మహాగౌరి రూపం తెల్లని వస్త్రాలతో అత్యంత శాంతమూర్తిగా ఉంటుంది. చతుర్భుజాల తో, కుడివైపు పై భుజంలో త్రిశూలాన్ని, కింది భుజంలో అభయహస్తాన్ని, ఎడమవైపు పై భుజంలో వరముద్రను, కింది భుజంలో ఢమరుకాన్ని ధరించి భక్తులను కటాక్షిస్తుంది. మహాగౌరి తన పార్వతి రూపంలో పరమ శివుడిని భర్తగా పొందేందుకు కఠోర తపస్సు చేయడం వల్ల ఆమె శరీరమంతా నల్లబడుతుంది. ఆ తపస్సుకు పరమశివుడు ప్రసన్నుడ వుతారు. అప్పుడు ఆ దేవి తేజోవంతమైన గౌరవర్ణంతో కనిపిస్తారు. అందుకే ఈ దేవిని మహాగౌరిగా పిలుస్తారు. దసరా మహోత్సవాల్లో 8వ రోజున ఈ దేవిని పూజిస్తారు. అలా పూజించడం వల్ల సకల పాపాలు నశిస్తాయని, కష్టాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం.



నంది వాహనంపై స్వామి అమ్మవార్లు

ఆర్‌యూలో ఎంబీఏ, ఎంసీఏ స్పాట్ అడ్మిషన్లు

కర్నూలు(అర్బన్), అక్టోబరు 10: రాయలసీమ యూనివర్సిటీలో ఈ నెల 14, 15 తేదీల్లో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్స్ ప్రొఫెసర్ ఎన్ నరసింహులు ఒక ప్రకటనలో తెలిపారు. కన్వీనరు కోటాలో మిగిలిన సీట్లకు నిర్వహించే స్పాట్ అడ్మిషన్లకు విద్యార్థులు దరఖాస్తుతో పాటు ఒరిజనల్ సర్టిఫికెట్లు, కుల ధృవీకరణ ట్యూషన్ ఫీజులతో హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాల కోసం యూనివర్సిటీ వెబ్ సైట్‌ను సంప్రదించాలని తెలిపారు.

టెట్‌కు 263 మంది అభ్యర్థుల గైర్హాజర్

కర్నూలు(ఎడ్యుకేషన్), అక్టోబరు 10: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు గురువారం 263 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారని డీఈవో శామ్యూల్ తెలిపారు. గురువారం ఉదయం, మధ్యాహ్నం జరిగిన రెండు సెషన్లకు 2,528 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, ఇందులో 2,265 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. 263 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన పరీక్షకు 1,156 మందికి గాను, 1,515 మంది హాజరు కాగా, 120 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం జరిగిన టెట్ పరీక్షకు 1372 మందికి గాను 1229 మంది అభ్యర్థులు హాజరు కాగా, 143 మంది గైర్హాజరయ్యారు. ఇన్‌చార్జి డీఈవో ఏడీ-2 శ్రీనివాసులు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

కొత్తపల్లి, అక్టోబరు 10: కొత్తపల్లి మండలం కొత్తమాడుగుల గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో బైక్ నుండి కింద పడి బొజ్జ రాజేశ్వరి (45) మృతి చెందింది. పాములపాడు గ్రామానికి చెందిన బొజ్జ సాయిబాబా బొజ్జ రాజేశ్వరి దంపతులు టీవీఎస్ ఎక్సెల్ ద్విచక్రవాహనంపై కొత్తపల్లి మండలంలోని బట్వారిపల్లి సరిహద్దులో ఉన్న తమ పొలానికి వెళ్తున్నారు. మార్గమధ్యంలో కొత్తమాడుగుల సమీపంలో మామిడితోట వద్ద బైక్ అదుపు తప్పి కింద పడ్డారు. దీంతో వెనుకాల కూర్చున్న రాజేశ్వరి తలకు బలమైన రక్తగాయాలు కావడంతో ఆత్మకూరులోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. మృతురాలి కుమారుడు బొజ్జ వెంకటేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కొత్తపల్లి ఎస్ఐ కేశవ తెలిపారు.

బాలికపై అత్యాచారం!

- ఆలస్యంగా వెలుగులోకి.. ● పోక్సో కేసు నమోదు

వెలుగోడు, అక్టోబరు 10: వెలుగోడు మండలంలోని ఓ గ్రామంలో ఐదో తరగతి చదువుతున్న ఓ బాలికపై అదే గ్రామానికి చెందిన పదో తరగతి చదువుతున్న ఓ బాలుడు అత్యాచారం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గురువారం ఎస్ఐ విష్ణు నారాయణ తెలిపిన వివరాల మేరకు ఈ నెల 1న ఈ ఘటన జరిగిందని తెలిపారు. కొన్ని రోజుల తర్వాత బాలిక అనారోగ్యంతో బాధ పడుతుండటంతో తల్లిదండ్రులు వైద్యశాలకు తరలించడంతో ఈ ఘటన బయట పడిందన్నారు. తల్లి తండ్రులు గట్టిగా ప్రశ్నించడంతో బాలిక జరిగిన విషయం చెప్పిందని అన్నారు. ఈ మేరకు ఈ నెల 8వ తేది బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారని అన్నారు. ఈ మేరకు బాలుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశామన్నారు. గురువారం బాలుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

నిందితులకు రిమాండ్

దేవనకొండ, అక్టోబరు 10: గాలిమరల కార్యాలయంపై దాడి కేసులోని నిందితులకు ఈ నెల 23 వరకు రిమాండ్‌ను న్యాయాధికారి ఆదేశించారు. ఈ నెల 3న మండలంలోని మాదాపురం వద్ద గ్రీన్ ఇన్‌ఫ్రా పవన విద్యుత్ కార్యాలయంపై ఆలూరు ఎమ్మెల్యే సోదరుడు వెంకటేష్, దేవనకొండ జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ (కిట్టు)లతోపాటు మరో 22 మంది దాడి చేశారు. దేవనకొండ పోలీసు స్టేషన్లో 333,324(4),(5),308(2) భారతీయ న్యాయ సంహిత చట్టం (బీఎన్ఎస్) కింద కేసు నమోదైంది. ఆలూరు, ఆస్పరి గాలిమరల కార్యాలయాలపై దాడి చేయడంతో రెండు చోట్ల కేసులు నమోదయ్యాయి. దేవనకొండ సీఐ వంశీనాథ్ పీటీ వారెంట్‌పై నిందితులను బుధవారం పత్తికొండ కోర్టులో హాజరుపరిచారు. న్యాయాధికారి వారిని రిమాండ్‌కి ఆదేశించారు.

ప్రాణం తీసిన రీల్స్

బైక్ పై నుంచి పడి యువకుడి మృతి



ఆంజనేయ (ఫైల్)

కోసిగి, అక్టోబరు 10: రీల్స్ పిచ్చి ఓ యువకుడి ప్రాణం తీసింది. ఈ ఘటన గురువారం కోసిగిలో చోటు చేసుకుంది. కోసిగిలోని రైల్వే గేటు సమీపంలోని సిద్ధారుడ శాంతాశ్రమం సమీపంలో నివాసం ఉంటున్నారు. చిన్నన్నపల్లి తిమ్మయ్య, లక్ష్మి దంపతుల మూడో కుమారుడు చిన్నన్నపల్లి అంజనేయ (18) అనే యువకుడు డ్రైవింగ్ చేస్తూ రీల్స్ తీసుకునే అలవాటు పెట్టుకున్నాడు. ఇందులో భాగంగానే గురువారం సాయంత్రం ఉరుకుంద రోడ్డు వైపు వెళ్తూ సెల్ఫీ తీసుకుంటున్నాడు. ఆ సమయంలో కళ్లకు కర్ఛీప్ అడ్డం పడటంతో ఎదురుగా వస్తున్న వాహనాన్ని గుర్తించలేక పోయాడు. సాయిబాబా గుడి సమీపంలో ఎదురుగా వస్తున్న కూలీల ఆటోను తప్పించబోయి అదుపు తప్పి కిందపడ్డాడు. దీంతో అంజనేయ తలకు బలమైన గాయాలయ్యాయి. అదే ఆటోలో అంజనేయ తల్లి లక్ష్మి, చెల్లెలు కొరవంజిమ్మ ఉన్నారు. అంజనేయను 108 వాహనంలో ఆదోని ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో తల్లి, చెల్లెలు గుండెలవిసెలా రోదించారు. గత వారం రోజుల క్రితం కూడా బైక్ ప్రమాదంలో అంజనేయ ముఖానికి తీవ్ర గాయాలైనట్టు తెలుస్తోంది. ఆదోని ఏరియాసుపత్రి అవుట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుడు ఆంజనేయ

బన్నీ ఏర్పాట్ల పరిశీలన

ఆదోని/హొళగుంద, అక్టోబరు 10 : హొళగుంద మండలం పరిధిలోని దేవరగట్టులో దసరా పండుగ సందర్భంగా ఈ నెల 12వ తేదీన జరిగే మాళ మల్లేశ్వర స్వామి బన్నీ ఉత్సవాలపై ఏర్పాట్లపై ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, పత్తికొండ ఆర్డీవో భరత్ నాయక్, పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించినట్లు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బన్నీ ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు. వాహనాల పార్కింగ్, సీసీ పుటేజ్, బారికేడ్లు, శానిటేషన్, మరియు లైటింగ్ ఏర్పాటు చేయవలసిన ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం అరికెర గ్రామంలో సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పత్తికొండ ఆర్డీవో భరత్ నాయక్ డీఎస్పీ వెంకట రామయ్య కలిసి గ్రామ ప్రజలకు ప్రశాంత వాతావరణంలో పండుగా జరుపుకునే విధంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్ రాజు, ఆదోని డీఎల్‌పీవో నూర్ జహాన్, ఆలూరు సీఐ శ్రీనివాస్ నాయక్, ఎస్సై బాలనరసింహులు, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

మిర్చి రైతును దగా చేసిన గోడౌన్ యజమాని, బ్యాంకర్లు

సంజామల, అక్టోబరు 10: మండలంలోని పేరుసోమల గ్రామానికి చెందిన మిర్చి రైతు సూర్య నారాయణ రెడ్డి తనను గోడౌన్ యజమాని, బ్యాంక్ అధికారి మోసం చేశారని ఆవేదన చెందాడు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో ఈ విషయం బట్టబయలు చేశాడు. ఆయన మాట్లాడుతూ గతేడాడి మే నెలలో సౌదరదిన్నె గ్రామంలో ఈదుల శివారెడ్డి గోడౌన్‌లో 185 బస్తాల మిరపకాయలను భద్రపరిచానన్నారు. మిరపకాయలకు మాయలూరు కరూర్ వైశ్య బ్యాంకులో రూ.5 లక్షలు లోనుగా తీసుకున్నానన్నారు. అనంతరం 57బస్తాలు మిరపకాయలను విక్రయించి బ్యాంకు లోను కట్టేశాడు. అయితే ఇటీవల బ్యాంకు మేనేజర్, సిబ్బంది తన ఇంటి దగ్గరికి వచ్చి 6 పేపర్లపై సంతకాలు తీసుకొని పోయారన్నారు. అనంతరం మిగిలిన బస్తాలను విక్రయించుకునేందుకు గోడౌన్ దగ్గరకు వెళ్లగా గోడౌన్ యజమాని నీ మిరపకాయలు ఎక్కడ ఉన్నాయి అప్పుడే అమ్మేశావని తనపై దాడి చేశాడన్నారు. బ్యాంకు అధికారులు తన మిరపకాయలు వేలం వేశారని గోడౌన్ యజమాని బుకాయించాడని ఆయన చెప్పారు. కోవెలకుంట్ల పోలీసు స్టేషన్‌లో గోడౌన్ యజమాని, బ్యాంకు మేనేజర్‌పై ఆయన కేసు నమోదు చేశారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

ఆదోని రూరల్, అక్టోబరు 10 : రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఆంజనేయ(49)ను ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో ఆయన మృతి చెందాడు. ఆస్పరికి చెందిన మూలింటి ఆంజనేయ కొంత కాలంగా కుటుంబ సభ్యులతో కలిసి ఆదోనిలో నివాసం ఉంటున్నారు. ఆయన సాదాపురం సమీపంలో ఉన్న పెట్రోలు బంకులో పని చేస్తున్నాడు. గురువారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో పెట్రోలు బంకు నుంచి సమీపంలో ఉన్న టీ కొట్టుకు వెళ్లి టీ తాగాడు. తిరిగి వెళ్లే క్రమంలో ఆస్పరి నుంచి ఆదోని వైపు వస్తున్న గుర్తు తెలియని బైక్ ఢీకొంది. దీంతో ఆంజనేయకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తాలుకా ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. మృతునికి భార్య లలితతోపాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు.

గుట్టుగా నాటు సారా తయారీ

దేవరగట్టు పరిసర ప్రాంతాల్లో నిల్వ

ఆలూరు, అక్టోబరు 10 : దేవరగట్టు పరిసర ప్రాంతాల్లో జోరుగా నాటుసారా తయారు చేస్తున్నారు. దసరా రోజున జరిగే దేవరగట్టు ఉత్సవాలకు భారీఎత్తున జనం రానుండటంతో ముందస్తుగా నాటుసారాను తయారు చేసి రహస్య ప్రాంతాల్లో భద్రపరచచినట్లు సమాచారం. అయితే పోలీసు, ఎక్సైజ్ అధికారులు సారా స్థావరాలపై దాడులు నిర్వహిస్తున్నా ఉత్సవం రోజున బహిరంగంగా సారా విక్రయాలు సాగుతుండటం షరా మాములుగా మారింది. నేరణికి, కొత్తపేట, అరికేర, నేరణికి తండా కొండల్లో అధికంగా ఈ నాటుసారా స్థావరాలు ఉన్నాయి. ఇప్పటికే పోలీసు, ఎక్సైజ్ శాఖల సిబ్బంది సారా స్థావరాలపై దాడులు నిర్వహించి బెల్లం ఊటలను, సారా బట్టీలను ధ్వంసం చేస్తున్నారు. ఈ ఉత్సవాల్లో నాటుసారా నియంత్రణకు అధికారుల చర్యలు ఏ మేర ఫలిస్తాయో చూడాలి.

ఏపీఎస్పీ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్‌గా నాగేంద్రరావు

కర్నూలు, అక్టోబరు 10: ఏపీఎస్పీ రెండో బెటాలియన్ అడిషనల్ కమాండెంట్‌గా నాగేంద్రరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన ప్రస్తుతం గ్రేహౌండ్స్ కమాండెంట్‌గా ఉంటున్నారు. ఇక్కడ ఉన్న అసిస్టెంట్ కమాండెంట్ కేశవరెడ్డికి అడిషినల్ కమాండెంట్‌గా పదోన్నతి కల్పించి ఫోర్త్ బెటాలియన్‌కు బదిలీ చేసింది. కర్నూలు ఏఆర్‌లో ఉన్న అడిషినల్ ఎస్పీ నాగబాబుకు కమాండెంట్‌గా పదోన్నతి కల్పించి ఇంటలిజెన్స్ విభాగానికి బదిలీ చేసింది. హోంగార్డు డీఎస్పీ కృష్ణమోహన్‌కు పదోన్నతి కల్పించి కర్నూలు ఏఆర్ అడిషనల్ ఎస్పీగా నియమించింది.

సాంకేతిక పరిజ్ఞానంతో ఉద్యోగావకాశాలు



సర్టిఫికెట్లు అందజేస్తున్న ఫెయిత్ హోమ్ నిర్వాహకులు

ఆదోని (అగ్రికల్చర్), అక్టోబరు 10: విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం ఉంటే ఉద్యోగావకాశాలు లభిస్తాయని ఎమ్మెల్సీ మధుసూదన్, ఫెయిత్ హోం అనాథాశ్రమ నిర్వాకుడు రెవరెండ్ డానియల్ ప్రేమ్ కుమార్ అన్నారు. ఉచిత కంప్యూటర్ శిక్షణ, స్పోకెన్ ఇంగ్లీష్ నేర్చుకున్న వారికి గురువారం సర్టిఫికెట్లు ఇచ్చారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు ఆరెకల్లు దేవదాస్ సిబ్బంది మనోజ్, షాజియా, ఉషారాణి, సుమంత్, ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

వెండి రథంపై ప్రహ్లాదరాయలు



రజత రథంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు



భక్తులతో కిక్కిరిసిన మఠం ప్రాంగణం

మంత్రాలయం, అక్టోబరు 10: మఠంలో ఉత్సవ మూర్తి ప్రహ్లాదరాయలు రజత రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. రాఘవేంద్ర స్వామి సజీవ సమాధి పొందిన గురువారం శుభ సందర్భాన్ని పురస్కరించుకుని పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో అర్చకులు బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రజిత రథాన్ని పుష్పాలతో అలంకరించి, వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల మధ్య ప్రహ్లాదరాయలను ఉంచి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించి ఊంజల సేవ చేశారు.

మంత్రాలయంలో కిక్కిరిసిన భక్తులు

భక్తులతో శ్రీమఠం కిక్కిరిసింది. గురువారం వేలాది మంది భక్తులు తరలి వచ్చారు. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, నదీతీరం భక్తులతో కోలాహలంగా మారింది. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.



సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలి

దేవనకొండ, అక్టోబరు 10: జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. గురువారం తెర్నెకల్‌లో మాట్లాడుతూ కరువు జిల్లా కర్నూలుపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. గురురాఘవేంద్ర, వేదవతి, గుండ్రేవుల, తుంగభద్రపై కుడి కాలువను నిర్మించి, హంద్రీ నీవా పెండింగ్ పనులను పూర్తి చేయాలన్నారు. శ్రీనివాసులు పార్టీ జెండాను ఆవిష్కరించారు. గ్రామ కార్యదర్శిగా మబూబ్ బాషాను ఎన్నుకున్నారు. వీరశేఖర్, బజారి, లక్ష్మిరెడ్డి, రాముడు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఆస్పరి, అక్టోబరు 10: స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని మృతదేహం గురువారం లభ్యమైనట్లు సీఐ మస్తాన్ వలి తెలిపారు. వివరాల మేరకు.. 45 నుంచి 50 సంవత్సరాల వయసు ఉంటుందని తెలిపారు. రైల్వే స్టేషన్‌కు మూడు కిలోమీటర్ల దూరంలో మృతదేహం ఉందని సమాచారం వచ్చింది. తెల్ల బనియన్, ఫుల్ డ్రాయర్ ఉందన్నారు. కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ఆసుపత్రికి తరలించామని సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

నందవరం, అక్టోబరు 10: ఆత్మహత్యాయత్నం చేసిన మాచాపురం గ్రామాని చెందిన నయోమి(17) అనే యువతి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వివరాల మేరకు.. మండలంలోని మాచాపురం గ్రామాని చెందిన పద్మమ్మ, రాజేష్ కుమార్తె నయోమి కొంతకాలంగా కండరాల నొప్పులతో బాధపడుతుండేది. తల్లిదండ్రులు చికిత్స చేయించినా నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి ఈ నెల 1వ తేదీన ఇంట్లో నిప్పు అంటించుకొంది. కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పాము కాటుతో వ్యక్తి..



రంగస్వామి(ఫైల్)

మద్దికెర, అక్టోబరు 10: పూజకు అవసరమయ్యే పూలు, నిమ్మకాయలు తెచ్చేందుకు తోటకు వెళ్లి పారా రంగస్వామి (53) పాము కాటుతో గురువారం సాయంత్రం మృతి చెందాడు. వివరాల మేరకు.. పెరవలి గ్రామానికి చెందిన పారా రంగస్వామి భార్య సులోచనమ్మ పదిహేనేళ్ల క్రితం మరణించింది. కుమారుడు విశ్వవర్ధన్‌తో కలిసి జీవిస్తుండేవాడు. రంగస్వామి తోటకు వెళ్లగా పాము కరిచింది గమనించక ఇంటికి వచ్చాడు. అయితే సాయంత్రం స్పృహ తప్పి పడిపోవడంతో కుటుంబసభ్యులు గుంతకల్లుకు తీసుకెళ్లేలోపు మృతి చెందాడు. రంగస్వామి టీడీపీ ఆవిర్భావం నుంచి కార్యకర్తగా పని చేస్తున్నాడు. టీడీపీ నాయకులు మెడికల్ తిమ్మప్ప, నారాయణ నివాళి అర్పించారు.

వ్యక్తిపై కేసు నమోదు

ఆదోని రూరల్ అక్టోబరు 10: మండలంలోని ఇస్వికి చెందిన పెద్ద వీరారెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగేంద్ర తెలిపారు. వివరాల మేరకు.. సమీప బంధువైన శ్యామలమ్మపై పెద్ద వీరారెడ్డి ఈ నెల 3వ తేదీన దాడిచేయడంతో తలపై గాయమైంది. బాధితురాలి కుమారుడు ఉదయ్ కుమార్‌రెడ్డి విషయం తెలుసుకుని గురువారం ఇస్వి పోలీస్‌స్టేషన్‌లో తల్లితో కలిసి ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.











పరిశ్రమలకు పత్తి వాహనాల క్యూ



భారీ సంఖ్యలో నిలిచిపోయిన పత్తి వాహనాలు

మార్కెట్ యార్డుకు సెలవులు

తెలియక వచ్చిన రైతులు.. తక్కువకే కొనుగోలు చేసిన పరిశ్రమల యజమానులు

ఆదోని (అగ్రికల్చర్), అక్టోబరు 10: మార్కెట్ యార్డ్‌కు దసరా పండుగను పురస్కరించుకొని గురువారం నుంచి మూడు రోజులు సెలవు ఇచ్చారు. దీంతో రైతులు పత్తి దిగుబడులను విక్రయించేందుకు నేరుగా పరిశ్రమలకు క్యూ కట్టారు. మార్కెట్‌కు సెలవుల విషయం తెలియని రైతులు మార్కెట్ వచ్చి అటునుంచి పత్తి జిన్నింగ్ మిల్లులకు చేరుకున్నారు. మార్కెట్ యార్డ్ చుట్టూ 15వరకు పరిశ్రమలు ఉండడంతో భారీ వాహనాలతో ప్రధాన గేటు వద్ద ఉదయం 10 గంటల నుంచి 12గంటల మధ్య వందల సంఖ్యలో వాహనాలు నిలబడిపోవడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. చివరకు మార్కెట్‌యార్డు గేట్లు తెరవడంతో అటునుంచి పరిశ్రమలకు వెళ్లాయి. దీంతో ట్రాఫిక్ క్లియర్ అయింది. పరిశ్రమల యజమానులు ఇదే అదునుగా భావించి దళారులతో వాహన డ్రైవర్లకు రూ.2వందలు కమీషన్ ఇస్తానని తీసుకెళ్లి, మార్కెట్ ధర కంటే రూ.500లు తక్కువగా కొనుగోలు చేశారు. క్వింటాలు మార్కెట్‌లో రూ.7,699లు కాగా, నాణ్యతను బట్టి రూ.6,000 నుంచి రూ.7,400లకు కొనుగోలు చేసినట్లు రైతులు పేర్కొన్నారు. దసరా కావడంతో విక్రయించుకున్నామని రైతులు తెలిపారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే బీవీ



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి

ఎమ్మిగనూరు, అక్టోబరు 10: నవరాత్రి ఉత్సవాల్లో గురువారం పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర రెడ్డి పూజలు నిర్వహించారు. అలాగే దుర్గాదేవి అలంకారంలో దర్శనం ఇస్తున్న అమ్మవారికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆర్యవైశ్య సంఘం నాయకులు ఎమ్మెల్యేను సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. టీడీపీ నాయకులు ప్రతాప్ ఉరుకుందయ్య శెట్టి, శ్రీకాంత్, రామదాస్ గౌడ్, రంగస్వామి గౌడ్, మిఠాయి నరసింహులు, రామకృష్ణ నాయుడు, చేనేత మల్లి, రాజు, కటారి రాజేంద్ర, గిరి, మిన్నప్ప, నరసింహులు పాల్గొన్నారు.

దుర్గాదేవి అలంకరణలో రాజ్యలక్ష్మి

మద్దికెర: పెరవలి గ్రామం రంగనాథ ఆలయంలో రాజ్యలక్ష్మి అమ్మవారు గురువారం దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ప్రధాన అర్చకుడు రంగస్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి ఉదయం కుంకుమార్చన, ప్రత్యేక పూజలు చేశారు.

భవాని అలంకరణలో అమ్మవారు

ఆలూరు, అక్టోబరు 10: పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం తుల్జాపూర్ భవాని అలంకరణలో వాసవి కన్యకా పరమేశ్వరి దేవి భక్తులకు దర్శనమిచ్చారు.

కస్తూర్బాలో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్

ఆలూరు, అక్టోబరు 10: కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ఖాళీగా ఉన్న పోస్టులను పొరుగు సేవల విధానంలో భర్తీ చేసేందుకు సమగ్ర శిక్ష ఈ నెల 5నా నోటిఫికేషన్ జారీ చేసింది. దరఖాస్తులను 15వ తేదీలోపు ఎంఈవో కార్యాలయాల్లో సమర్పిస్తే వచ్చిన దరఖాస్తులను ఎంఈవో ఈ నెల 17న జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయంలో ఇవ్వాలని నోటిఫికేషన్‌లో పేర్కొంది. కేజీబీవీ టైప్ 3 పరిధిలోకి కస్తూర్బా పాఠశాలలు, టైప్-4 పరిధిలో మోడల్ స్కూల్ గర్ల్స్ హాస్టల్స్ ఉన్నాయి. అయితే గురువారం కేజీబీవీ టైప్ 4పరిధిలో ఉన్న మోడల్ స్కూల్ గర్ల్స్ హాస్టల్స్‌లోని చౌకీదార్ పోస్ట్‌కు దరఖాస్తు చేసేందుకు వెళ్లిన వారిని ఎంఈవో కోమల దేవి నిరాకరించారు. తమకు సంబంధం లేదని కేవలం కేజీబీవీ పాఠశాలల్లో మాత్రమే దరఖాస్తులు తీసుకుంటామని, విలేకరులు ఎంత వివరించినా ఎంఈవో అంగీకరించలేదు. దీంతో ఎంఈవోకు కనీస అవగాహన లేదని దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మద్దికెర: కస్తూర్బా గాంధీ, ఆదర్శ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో రంగస్వామి కోరారు. కస్తూర్బా పాఠశాలలో హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్, చౌకీదార్ పోస్టులు ఉన్నాయన్నారు. 15వ తేదీలోపు ఎంఈవో కార్యాలయంలో దరఖాస్తు ఇవ్వాలన్నారు.

తుగ్గలి: కస్తూర్బా పాఠశాలల్లో ఖాళీగా ఉన్న అవుట్‌సోర్సింగ్ నాన్ టీచింగ్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో రమా వెంకటేష్ గౌడ్ తెలిపారు. స్కావెంజర్స్, అసిస్టెంట్ కుక్, వాచ్‌మెన్ పోస్టులు ఉన్నాయన్నారు.

టీడీపీ నాయకుడి జన్మదిన వేడుకలు



రమాకాంత్ రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతూ..

పెద్దకడుబూరు, అక్టోబరు 10: రాష్ట్ర తెలుగు రైతు సంఘం అధికార ప్రతినిధి రమాకాంత్ రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం నిర్వహించారు. శివాలయంలో పూజలు నిర్వహించారు. కార్యకర్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. మల్లికార్జున, సత్యన్నగౌడ్, రామలింగ, మీసేవ ఆంజినేయులు, చిన్నతుంబళం వీరేష్ గౌడ్, చంద్ర, శివ, ఈరన్న, బొగ్గుల తిక్కన్న, యంజీ నరసన్న, బోగ్గుల బాష, అంజి, సుధాకర్, నాగేష్ పాల్గొన్నారు

పబ్లిక్ నోటీస్

తేదీ:11-10-2024

కర్నూల్ జిల్లాకి చెందిన అనేక సర్వే నంబర్లలో ఉన్న డ్రై అగ్రికల్చర్ భూములను మా క్లయింట్ జెంటారీ రెన్యూవబుల్స్ ఇండియా క్వార్టర్ వన్ ప్రైవేట్ లిమిటెడ్, గురుగ్రామ్, హర్యానా వారు భూమి యజమానుల వద్ద నుండి కొనుగోలు చేయాలని భావిస్తున్నట్లు సాధారణ ప్రజలకు సమాచారం అందించారు. ఆ సమాచారం మేరకు కొందరు భూమి యజమానులు మా క్లయింట్ వారికి భూములు అమ్ముటకు సమ్మతించారు. భూమి మరియు దాని యజమానుల వివరాలు షెడ్యూల్ పోర్షన్‌లో క్రింద పేర్కొనబడ్డాయి. ఈ క్రింద పేర్కొన్న యజమానులు వారు వారి షెడ్యూల్ ఆస్తులపై సంపూర్ణ యజమాన హక్కులు కలిగి సదరు భూములపై స్వాధీన అనుభవంతో ఉన్నారు.

ఏదైనా వ్యక్తి / ఆ సంస్థ / బ్యాంక్ లేదా ఆర్థిక సంస్థ ఏదైనా హక్కు, టైటిల్, క్లెయిమ్, ప్రయోజనం, ఎస్టేట్, వాటా, డిమాండ్ లేదా మరియేతర హక్కు కలిగి ఉంటే లేదా సేల్, బదిలీ ద్వారా షెడ్యూల్ ప్రాపర్టీలు లేదా దానిలోని ఏదైనా భాగానికి సంబంధించి ఏదైనా స్వభావం కలిగి ఉంటే లేదా క్లెయిమ్ చేస్తే, మార్టిగేజ్, అసైన్‌మెంట్, ఛార్జ్, దానము, ఒడంబడిక, ట్రస్ట్, లైసెన్స్, అద్దె, వాటా, ఉప-అద్దె, వారసత్వం, దావా, అనుమతి, లీజు, ఉప-లీజు, తాత్కాలిక హక్కు, తనఖా, సడలింపు, రూపకల్పన, రిక్వెస్ట్, హైపోథికేషన్, భారాలు, స్వాధీనం అభివృద్ధి హక్కులు, పార్ట్ పెర్ఫార్మెన్స్‌లో స్వాధీనం, భాగస్వామ్యం, కుటుంబ ఏర్పాటు / సెటిల్‌మెంట్, లిస్ పెండెన్స్‌లు, ఏదైనా న్యాయస్థానం యొక్క డిక్రీ ఆర్డర్ లేదా ఎలాగైనా, చట్టం యొక్క ఆపరేషన్ ద్వారా లేదా మరేదైనా, మద్దతు పత్రాలతో పాటుగా తమ అభ్యంతరాలను దాఖలు చేయవలసి ఉంటుంది. ఈ నోటీసు ప్రచురించబడిన తేదీ నుండి 7 (ఏడు) రోజులలోపు అభ్యంతరాలను ఈ క్రింద కనపరచిన చిరునామా నందు దాఖలు చేయడంలో విఫలమైతే, షెడ్యూల్‌లో లేదా దాని మీద లేదా దానికి సంబంధించి ఎలాంటి ప్రతికూల హక్కు, టైటిల్ ఆసక్తి, వాటా, దావా లేదా డిమాండ్ ఉండదని భావించబడుతుంది. ఆస్తి వివరములు.

భూమి మరియు దాని యజమానుల షెడ్యూల్ మరియు వివరాలు వరుసగా

క్ర. సం	రైతు పేరు	ఖాతా నెం.	సర్వే నెం.	మొత్తం విస్తీర్ణం	గ్రామం	మండలం
1	ఎరుగుండాల విష్ణువర్ధన్ రెడ్డి S/o ఎరుగుండాల మీనాక్షి నాయుడు	1650	26-B	2.29	ఏరూరు	చిప్పగిరి
2	ఎరుగుండాల విష్ణువర్ధన్ రెడ్డి S/o ఎరుగుండాల మీనాక్షి నాయుడు	1650	26-A	1.43	ఏరూరు	చిప్పగిరి
3	సి.శ్రీనివాసులు చౌదరి S/o రామచంద్రప్ప	1694	26-B	0.58	ఏరూరు	చిప్పగిరి
4	సి.శ్రీనివాసులు చౌదరి S/o రామచంద్రప్ప	1694	26-A	0.32	ఏరూరు	చిప్పగిరి
5	సి.శ్రీనివాసులు చౌదరి S/o రామచంద్రప్ప	1694	26-C	2.37	ఏరూరు	చిప్పగిరి
6	లక్ష్మీ నారాయణరావు S/o శ్యామరావు	211	26-C	2.18	ఏరూరు	చిప్పగిరి
7	బి. చంద్రశేఖర్ S/o రామాంజినేయులు	748	27	8.28	ఏరూరు	చిప్పగిరి
8	బావిగడ్డ నారాయణస్వామి S/o రామాంజినయ్య	911	27	8.28	ఏరూరు	చిప్పగిరి
9	గోవింద్‌రెడ్డి S/o నారాయణ రెడ్డి	58	64-C	5.95	సిరుగపురం	హోలహర్వి
10	గూళ్యపాలెం కృష్ణ చైతన్యరెడ్డి S/o నారాయణ రెడ్డి	656	64-C	2.87	సిరుగపురం	హోలహర్వి
11	గోవింద్ రెడ్డి S/o నారాయణ రెడ్డి	58	60-B	2.27	సిరుగపురం	హోలహర్వి
12	గూళ్యపాలెం కృష్ణ చైతన్యరెడ్డి S/o నారాయణ రెడ్డి	656	60-B	1.13	సిరుగపురం	హోలహర్వి
13	K మల్లప్ప S/o K ఈరన్న	403	321	2.945	కురువల్లి	ఆలూరు
14	సేరి రాముడు S/o సేరి ఈరన్న	400	321	3.113	కురువల్లి	ఆలూరు
15	కె. రమేష్ S/o పాండురంగప్ప	732	321	5.763	కురువల్లి	ఆలూరు
16	జి.మల్లయ్యస్వామి S/o జి.పాండురంగప్ప	318	320	3.012	కురువల్లి	ఆలూరు
17	కురువ ఇందు S/o గంగప్పగారి కురువ సురేష్	761	320	3.175	కురువల్లి	ఆలూరు
18	G రాఘవేంద్ర S/o G పాండు రంగప్ప	435	332	3.470	కురువల్లి	ఆలూరు
19	R.భీమేష్ S/o భీమలింగప్ప	932	457	7.88	బెలడోన	చిప్పగిరి
20	B.చంద్రశేఖర్ S/o రామాంజినేయులు	748	27	8.28	ఏరూరు	చిప్పగిరి
21	బావిగడ్డ నారాయణస్వామి S/o రామాంజినయ్య	911	27	8.28	ఏరూరు	చిప్పగిరి
22	ఎరగుండుల మీనాక్షి నాయుడు S/o దామన్న	798	180-A	6.00	ఏరూరు	చిప్పగిరి
23	ఎరగుండుల హరీష్ S/o రాజన్న	799	180-A	6.00	ఏరూరు	చిప్పగిరి
24	J. రమణయ్య S/o హనుమంతప్ప	476	180.BC1	3.46	ఏరూరు	చిప్పగిరి
25	J. రమణయ్య S/o హనుమంతప్ప	476	180.BC2	3.58	ఏరూరు	చిప్పగిరి
26	అనునుడి రామ క్రిష్టప్ప S/o అనునుడి నేమకల్లప్ప	480	691-B	14.42	హలాహర్వి	హోలహర్వి
27	అనునుడి హేమవతి W/o అనునుడి రామ క్రిష్టప్ప	942	691-B	7.00	హలాహర్వి	హోలహర్వి
28	అనునుడి అనిల్ కుమార్ S/o అనునుడి రామ కృష్ణప్ప	943	691-B	1.08	హలాహర్వి	హోలహర్వి
29	అనునుడి అనిల్ కుమార్ S/o అనునుడి రామ కృష్ణప్ప	943	691-C	6.35	హలాహర్వి	హోలహర్వి
30	J. శ్రీనాథ్ S/o J. మాణిక్య శాస్త్రి	12	691-D	4.54	హలాహర్వి	హోలహర్వి
31	బి.గోపాల్ S/o బి రామాంజిని	775	34-C	3.49	సిరుగపురం	హోలహర్వి
32	బి.గోపాల్ S/o బి రామాంజిని	775	34-D	0.80	సిరుగపురం	హోలహర్వి
33	T.నరేష్ S/o T.గోవిందప్ప	739	34-E/1	2.41	సిరుగపురం	హోలహర్వి
34	బి.మౌలాలి S/o ఉలిగన్న	458	34-C	4.00	సిరుగపురం	హోలహర్వి
35	H.T. శ్రీనివాస రెడ్డి S/o హోలహర్వి తిప్పారెడ్డి గారి రంగనాథ్ రెడ్డి	2263	177	14.13	హలాహర్వి	హోలహర్వి
36	చెరుకూరు సత్యన్న S/o లక్ష్మన్న	578	122-A1	4.08	ఏరూరు	చిప్పగిరి
37	చెరుకూరు వినయ్ S/o నారాయణ స్వామి	1492	123	5.00	ఏరూరు	చిప్పగిరి
38	సి మధన్ మోహన్ S/o నారాయణ స్వామి	1412	123	1.27	ఏరూరు	చిప్పగిరి
39	మధన్ మోహన్ S/o నారాయణ స్వామి	1412	122-A2	3.75	ఏరూరు	చిప్పగిరి
40	శ్రీరాములు S/o నెట్టేకల్లు	649	39-C3	2.72	రామదుర్గం	చిప్పగిరి
41	శాంతమ్మ W/o మల్లయ్య	550	39-C3	2.73	రామదుర్గం	చిప్పగిరి
42	జయమ్మ W/o రోగయ్య	1282	39-C3	2.80	రామదుర్గం	చిప్పగిరి
43	రామాంజినేయులు S/o చిన్న నెట్టేకల్లు	552	39-C4	4.00	రామదుర్గం	చిప్పగిరి

షేక్ ఖుదుద్దీన్, MBA., LLB., అడ్వకేట్,
డి.నెం. 1-52, తిమ్మాపూర్ (గ్రామం), మిడుతూర్ (మం.),
నంద్యాల జిల్లా. సెల్ : 90520 65030